## రేపు బ్యాడ్మింటన్ అండర్-17 ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22: ఈనెల 24న ఉమ్మడి జిల్లాల అండర్-17 బాల బాలికల బ్యాడ్మింటన్ ఎంపికలను నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కామారెడ్డి బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ ఎంపికలను నిర్వహించనున్నామని ఆమె తెలిపారు. ఉదయం 9గంటల వరకు అకాడమీకి చేరుకోవాలని, ఆసక్తిగల క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్ వెంట తీసుకొని రావాలని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి తెలిపారు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

## ఉస్మానియా యూనివర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి అండగా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సూరవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు, హైండ్లూమ్ ఇన్‌స్టిట్యూట్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును, తెలుగు యూనివర్సిటీకి సూరవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెడుతూ తెలంగాణ ప్రభుత్వం రెండు రోజుల క్రితం మంత్రి మండలిలో నిర్ణయం తీసుకుందన్నారు. తెలుగు యూనివర్సిటీ అంటేనే పొట్టి శ్రీరాములు పేరు గుర్తుకు వస్తుందన్నారు. పొట్టి శ్రీరాములు జాతియోధ్యమంలో పాల్గొన్నారని, గాంధీతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పనిచేశారని అన్నారు. దళితుల అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. అలాంటి జాతీయ నాయకుడి పేరు మార్చడం అనేది వారిని అవమానించడమే అవుతుందన్నారు. రాజకీయ సాంఘిక చైతన్యానికి గుర్తుకు వచ్చే సూరవరం ప్రతాప్‌రెడ్డి పేరును ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పెట్టాలని ఆయన కోరారు. నిజాం నిరంకుశ పాలనలో తెలుగు వారిపై జరుగుతున్న అఘాయిత్యాలను తన కలంతో ప్రజలకు చెప్పడంతో పాటు చైతన్యపరిచారని ఆయన అన్నారు. తెలంగాణ బిడ్డల గుండెల్లో నిలవాలంటే ఉస్మానియాకు ఆయన పేరు పెట్టాలన్నారు. అదేవిధంగా ప్రజల ఆకాంక్షలకు, అస్తిత్వానికి ప్రతీకలైన జిల్లాల పేర్లను కూడా మార్చాలని ఆయన తెలిపారు. ఇదే విషయమై తాను అసెంబ్లీలో కూడా ప్రతిపాదించానని తెలిపారు. నిజామాబాద్‌ను ఇందూరుగా, ఆదిలాబాద్‌ను ఎదులపురంగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్‌ను మానుకోటగా, వరంగల్‌ను ఓరుగల్లుగా, హైదరాబాద్‌ను భాగ్యనగర్‌గా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఇవేమి చేయకుండా నిజాం వారసులైన ఎంఐఎం వారు చెప్పినట్లు ఆయన పనిచేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా ప్రజాపాలన పేరు మీద చేపట్టారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, హామీలను నెరవేర్చే విధంగా పాలన కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూ పవిత్రమైనదని ఆయన అన్నారు. అలాంటి లడ్డూ తయారీలో అప్పటి జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆయన అన్నారు. హైడ్రాను జిల్లాలో కూడా అమలు చేయాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన వేలాది ఎకరాల భూములు కబ్జాదారుల చేతిలో ఉన్నాయని అన్నారు. చెరువులతో పాటు కాలువలను కూడా కబ్జా చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీది నిజామాబాద్ కాదని, ఆయన రాష్ట్రానికి సలహాదారు అని నిజామాబాద్‌లోనే ఉంటానంటే ఊరుకునేది లేదన్నారు. జిల్లాలోని అధికారులు తప్పనిసరిగా ప్రోటోకాల్‌ను పాటించాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ న్యాలం రాజు, మల్లేష్‌యాదవ్‌తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.




## జిల్లాలో పెరిగిన.. భూగర్భ జలాలు

- జిల్లా వ్యాప్తంగా నిండుకుండలా చెరువులు, ప్రాజెక్టులు
- జిల్లాలో సరాసరి 8.66 మీటర్ల లోతుల్లో నీటిమట్టం
- యాసంగి పంటలకు ధోకా లేదంటున్న అధికారులు



నిజామాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భూగర్భజలాలు పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో గణనీయంగా పెరగగా మరికొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరుగా పెరిగాయి. ఆగస్టు నెలలో మూడు నాలుగు వారాల్లో ఏకదాటిగా భారీ వర్షాలు పడినా.. అనుకున్న విధంగా మాత్రం నీటి మట్టాలు పెరగలేదు. గత సంవత్సరంతో పోలిస్తే ఇప్పటికీ తక్కువగానే ఉన్నాయి. జూన్, జూలై నెలల్లో తక్కువగా వర్షాలు పడటం వల్ల భూగర్భ జలాలు భారీగా వినియోగం అయ్యాయి. ఆగస్టు నెలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడినా.. నీళ్లు బయటకు వెళ్లడం వల్ల నీటిమట్టాలు గత సంవత్సరంతో పోలిస్తే ఇంకా తక్కువగానే ఉన్నాయి. జిల్లాలో సరాసరి భూగర్భజల నీటిమట్టాలు పెరిగినా వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల సరాసరి అందుబాటులో ఇంకా 8.66 మీటర్ల లోతులోనే ఉన్నాయి. గత సంవత్సరం ఆగస్టు నెలలో 6.73 మీటర్ల లోతులో అందుబాటులో ఉండగా ఈ సంవత్సరం మాత్రం ఇంకా ఎక్కువలో తు లోనే ఉన్నాయి. ప్రస్తుతం పెరిగిన భూగర్భ జలమట్టాలు యాసంగి పంటలకు కూడా ఇబ్బంది లేదని భూగర్భ జల వనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. చెరువులు, కుంటలు నిండి ఉండటం, వాగులు ఇప్పటికి పారుతుండటం ప్రధాన ప్రాజెక్టులు నిండి ఉండటం వల్ల భూగర్భ జలమట్టాలు ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనాకు వస్తున్నారు. వానాకాలంతో పాటు యాసంగి పంటలకు కూడా నష్టం లేదని అంచనా వేయడంతో పాటు నివేదికలను సిద్ధం చేస్తున్నారు.

### జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు

జిల్లాలో ఈ సంవత్సరం భారీ వర్షాలే పడ్డాయి. జూన్, జూలై నెలలో వర్షాలు తక్కువగా పడిన ఆగస్టు నెలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడ్డాయి. జిల్లాలో సరాసరి సగటు వర్షపాతం కూడా నమోదైంది. జిల్లాలోని మెజార్టీ మండలాల్లో సాధారణ వర్షపాతానికి మించి వర్షం పడింది. జిల్లాలో ఈయేడాది జూ న్ నుంచి ఇప్పటి వరకు 805 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 1036 మిల్లీ మీటర్ల వర్షం పడింది. సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలోని 25 మండలాల్లో సగటు వర్షపాతానికి మించి ఈ వర్షం పడింది. ఆగస్టులోనూ పడిన వర్షాలతో జిల్లాలోని చెరువులన్నీ నిండాయి. అలుగులు పారాయి. జిల్లాలో ప్రధానమైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టు కూడా నిండటంతో గేట్లను ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేశారు. కాలువలకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ఆయకట్టుకు సైతం నీటిని అందిస్తున్నారు. జూన్ నెలలో తక్కువగా వర్షం పడటం వల్ల చెరువులు, కుంటల్లోకి నీళ్లు రాలేదు. భూగర్భ జలాలపై ఆ ప్రభావం ఎక్కువగా పడింది. జూలై నెలలో కూడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ఈనెలలో కూడా చెరువులు, కుంటలతో పాటు ప్రాజెక్టులల్లో కూడా నీళ్లు చేరలేదు. ఆగస్టు నెలలో అల్పపీడనంతో పాటు నైరుతి రుతుపవనాలు రావడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడ్డాయి. ఆగస్టు మూడు నాలుగు వారాల్లో పడిన వర్షాలతో చెరువులన్నీ నిండాయి. వాగులు పొంగాయి. ప్రధాన ప్రాజెక్టులు నిండటంతో పాటు గేట్లను ఎత్తి నీటిని దిగువ గోదావరికి వదిలి వేశారు. ఆగస్టు నెలలో పడిన భారీ వర్షాలతోనే రెండు పంటలకు సరిపడా నీళ్లు వచ్చాయి.

### జూన్‌లో బోర్ల వినియోగం అధికం

వర్షాలు సకాలంలో పడకపోవడం వల్ల ఆ ప్రభావం భూగర్భ జల మట్టాలపై పడింది. జిల్లాలో జూన్, జూలై, ఆగస్టు నెలల్లో భూగర్భ జల వనరుల శాఖ శాస్త్రవేత్తలు తీసిన నీటి లెక్కలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. జూన్ నెలలో పంటలు వేసిన రైతులు ఎక్కువ మొత్తంలో బోర్లను వినియోగించారు. వర్షాలు పడకపోవడం వల్ల భూగర్భ జలాల వినియోగం ఎక్కువగా పెరిగింది. దీని ప్రభావం భూగర్భ జలమట్టాలపైనే పడింది. జిల్లాలో మొత్తం లక్షా 75వేల వరకు బోర్లు ఉన్నాయి. వీటన్నింటిని రైతులు వినియోగించి ఆరుతడి పంటలతో పాటు వరిసాగును మొదలు పెట్టడంతో వినియోగం ఎక్కువ కావడం, వర్షాలు పడకపోవడం వల్ల నీటిమట్టాలు పెరగలేదు. భూగర్భ జల వనరుల శాఖ లెక్కల ప్రకారం మే నెలలో 12.17 మీటర్లలోతులో భూగర్భ జలాలు ఉండగా, జూలై నెలలో 10.55 మీటర్ల లోతుకు వచ్చాయి. జూలై నెలలో వర్షాలు ఓ మోస్తరు నుంచి కొన్ని చోట్ల భారీ వర్షాలు పడటంతో కొంత మేర నీటి మట్టాలు మే నెలతో పోల్చుకుంటే పెరిగాయి. ఆగస్టు నెలలో పడిన భారీ వర్షాలతో మరింత నీటిమట్టాలు పెరిగాయి. జిల్లాలో సరాసరి ఆగస్టు నెలలో భూగర్భజల అధికారులు తీసిన సర్వే సాంపిల్ ప్రకారం 8.66 మీటర్ల లోతు లో ఉన్నాయి. జిల్లాలో ఎక్కువగా భూమి, గ్రానైట్, రాళ్లతో కూరుకొని ఉండటం వల్ల నీటిమట్టాలు ఎక్కువగా పెరగడం లేదు. గత సంవత్సరం ఆగస్టు నెలలో పరిశీలిస్తే జిల్లాలో సరాసరి నీటి మట్టాలు 6.73 మీటర్ల లోతులో ఉన్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే రెండు మీటర్లు తక్కువ గా ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా భీంగల్, నవీపేట, డిచ్‌పల్లి, మోపాల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో రాతిపొరలు ఎక్కువగా ఉండటం వల్ల నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని వారు అంచనా వేశారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో 82 బోర్ల వారిగా వీరు సాంపిల్ సర్వే చేపట్టారు. వీరి పరిశీలనలో 53 ప్రాంతాల్లో పది మీటర్ల లోతులోనే భూగర్భ జలమట్టాలు ఉన్నాయి. మరో 19 చోట్లలో 10 నుంచి 15 మీటర్లలోతు, ఏడు చోట్ల మాత్రం 15 నుంచి 20 మీటర్ల లోతులో ఉన్నట్లు సర్వే సాంపిల్ రిపోర్టు ఆధారంగా వారు పేర్కొన్నారు. జిల్లాలో తీసుకున్న సాంపిల్ సర్వే ప్రకారం మొత్తం భూవిస్తీర్ణంలో 65 శాతం భూమిలో పది మీటర్ల లోతులోనే నీటిమట్టాలు అందుబాటులో ఉన్నాయి. ముప్పై ఒకటి శాతం భూమిలో 10 నుంచి 20 మీటర్ల లోతులో నీటిమట్టాలు ఉన్నట్లు వారు అంచనా వేశారు. నాలుగు శాతం భూమిలో మాత్రం 20 మీటర్లకంటే ఎక్కువ లోతులో ఉన్నట్లు అంచనాకు వచ్చారు. జిల్లాలో ప్రస్తుతం వర్షాలు పడటం చెరువుల్లో నీటినిల్వలు ఉండటం వల్ల బోర్ల వినియోగం తగ్గినట్లు అంచనా వేశారు. ప్రాజెక్టు నుంచి కూడా ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుండటం, ఇంకా వర్షాలు పడే అవకాశం ఉండటం వల్ల భూగర్భ జల మట్టాలు మరికొంత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భూగర్భ జల నీటిమట్టాల వినియోగం ప్రకారం ఈ పంటతో పాటు వచ్చే యాసంగి పంటకు కూడా సరిపడే విధంగా జలవనరులు ఉన్నట్లు అంచనా వేశారు. జిల్లాలో ఆగస్టు నెలలో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పెరిగాయని భూగర్భ జల శాఖ ఇన్‌చార్జి డిడి శ్రీనివాస్‌బాబు తెలిపారు. ఆగస్టు నెలలో ఎక్కువగా వర్షాలు పడటం వల్ల నీటి మట్టాలు గణనీయంగా పెరిగాయని అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే తక్కువగా ఉన్న పంటలకు మాత్రం ఢోకా లేదని తెలిపారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న ట్రేసా ప్రతినిధులు

## తహసీల్దార్లు సొంత జిల్లాకు వచ్చేనా..?

- ఏడాది కాలంగా ఇతర జిల్లాల్లోనే విధులు
- రెవెన్యూ మంత్రిని కలిసిన 'ట్రేసా' ప్రతినిధులు
- సొంత శాఖకు వచ్చేందుకు వీఆర్‌వోల ఆసక్తి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 22: గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్‌లు సొంత జిల్లాకు వచ్చేందుకు ఎదురు చూస్తున్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా సొంత జిల్లాల్లో ఉండవద్దనే నిబంధనతో జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు మల్టీజోన్ పరిధిలోని నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, సిద్ధిపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఇతర జిల్లాలకు బదిలీ కాగా నాయబ్ తహసీల్దార్లు జోన్-2 పరిధిలోని నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల్ జిల్లాలకు బదిలీ అయ్యారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసినప్పటికీ వారు సొంత జిల్లాలకు రాలేకపోతున్నారు. కుటుంబాలను వదిలి ఏడాది కాలంగా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని 33 మండలాల్లో ప్రస్తుతం ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లు పనిచేస్తున్నారు. వారికి ఇక్కడి పరిస్థితులు అవగాహన లేకపోవడంతో మండల స్థాయిలో భూసమస్యలు, ఇతర సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లాకు చెందిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు జిల్లాకు వస్తే వారికి స్థానిక సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండటంతో ఆ సమస్యలు చాలా వరకు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నాయి. శుక్ర, శనివారాల్లో రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో భేటీ అయ్యీ ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. సిసిఎల్‌ఏ కమీషనర్ నవీన్ మిట్టల్‌ను కలిసి బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. దీనికి వారి నుంచి సానుకూల స్పందన రావడంతో త్వరలోనే బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

### 25 మందికి పైగా తహసీల్దార్లు, 9 మంది నాయబ్ తహసీల్దార్లు

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆగస్టు 2023లో జిల్లాకు చెందిన 25 మందికి పైగా తహసీల్దార్లు మల్టీ జోన్ పరిధిలోని ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. 9 మంది నాయబ్ తహసీల్దార్లు ఎన్నికల సంఘం ఏఈఆర్‌వోలుగా నోటిఫైడ్ చేయడంతో జోన్-2 పరిధిలోని ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. గత ఏడాది కాలంగా అనేక ఇబ్బందులు పడుతూ వారు విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబాలను, భార్య పిల్లలను వదిలి ఇతర జిల్లాల్లో ఏడాది కాలంగా ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 33 మండలాల్లో ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లు పనిచేస్తున్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు జిల్లాకు బదిలీ అయితే ఇతర జిల్లాల నుంచి ఇక్కడ పనిచేస్తున్న వారు వారి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లు కూడా జిల్లాలో పనిచేసేందుకు అంతగా ఆసక్తిని చూపడం లేదు. దీంతో మండలాల్లో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. భూసమస్యలు, ఇతర సమస్యలపై ఇతర జిల్లాల వారికి సరైన అవగాహన లేకపోవడంతో ఆ సమస్యలు అలాగే పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లాపై, మండలాలపై అవగాహన కలిగిన జిల్లాకు చెందిన తహసీల్దార్లు వస్తే తప్ప సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశాలు లేవు.

### సొంత శాఖకు తీసుకోవాలని వీఆర్‌వోల విజ్ఞప్తి

గత ప్రభుత్వం వీఆర్‌వోలను రెవెన్యూ శాఖ నుంచి ఇతర శాఖలకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోగా ఇతర శాఖల్లో పనిచేస్తున్న వీఆర్‌వోలు మళ్లీ సొంత శాఖకు వచ్చేందుకు ఆసక్తిగా ఉన్నారు. జిల్లాలో 250 మందికిపైగా వీఆర్‌వోలు మళ్లీ తమను రెవెన్యూ శాఖకు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇతర శాఖల్లో తాము ఉండలేకపోతున్నామని వారు కోరుతున్నారు. వీఆర్‌ఏలు సైతం ఇతర శాఖలకు కేటాయించారు. జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్లుగా వివిధ శాఖలకు వీఆర్‌ఏలను కేటాయించగా వారి విద్యార్హతను బట్టి జిల్లాలో వారికి తగిన పోస్టులు లేకపోవడంతో కొంత మంది ఇతర జిల్లాలకు వెళ్లారు. తిరిగి తమను సొంత జిల్లాకు కేటాయించాలని వారు కోరుతున్నారు.





గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన

జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో మహిళా ఓటర్లే అధికం

## మహిళా ఓటర్లే అధికం

నిజామాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని గ్రామాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జనాభాలో వారే అధికంగా ఉండగా ఓటర్లలో కూడా వారే ఎక్కువగా ఉన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు యంత్రాంగం సిద్ధమవుతుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రకటించిన ఓటరు జాబితాలోనూ వారే ఎక్కువగా ఉన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించగా దానిలోనూ వారు ఎక్కువగానే ఉన్నారు. గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో విడుదల చేసిన జాబితాలోనూ వారే ఎక్కువగా ఉండగా ఓటు హక్కు కూడా ఎక్కువగా మహిళలే వినియోగించుకున్నారు. వచ్చే స్థాని క సంస్థల ఎన్నికల్లో మహిళలకు కూడా రిజర్వేషన్ ఉండటం వల్ల ఈ దఫా కూడా రిజర్వేషన్‌కు మించి పోటీ పడేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల్లో ప్రధానమైన పోస్టులకు పోటీ చేసేందుకు ముందస్తుగానే ఏర్పాట్లను చేసు కుంటు న్నారు.

### జిల్లాలో 545 గ్రామ పంచాయతీలు

జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల పరిధిలో ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు. ముసాయిదా జాబితాను ప్రకటించారు. జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల పరిధిలో 8లక్షల 29వేల 463 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వీరిలో పురుష ఓటర్లు 3లక్షల 86వేల 493 మంది ఉండగా, మహిళా ఓటర్లు 4లక్షల 42వేల 955 మంది ఉన్నారు. వీరితో పాటు ఇతరులు 15 మంది ఉన్నారు. జిల్లాలో ప్రకటించిన ఓటరు ముసాయిదా జాబితాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 56వేల 462 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలో మహిళా జనాభాను ఎక్కువగా ఉండగా ఓటరులోనూ వారే ముందున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని 5020 వార్డుల్లో ఇంటింటి సర్వేను నిర్వహించారు. వార్డుల వారిగా ఓటరు జాబితాను సిద్ధం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఈ జాబితాను ప్రకటించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో జాబితాను నోటీసు బోర్డుపై ఉంచడంతో పాటు ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ఆ ఫిర్యాదుల ఆధారంగా మార్పులు చేర్పులను కూడా చేస్తున్నారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వారిగా ఓటరు జాబితాను ప్రకటించగా గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఎన్నికలు జరగనుండటంతో దానికి అనుగుణంగానే సిద్ధం చేశారు. ఏ వార్డులో ఎన్ని ఇండ్లు ఉన్నాయో పరిశీలించడంతో పాటు వారి జాబితాను సిద్ధం చేసి ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించారు. బీసీ గణన తర్వాత ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నా.. ముందస్తుగా సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో అన్ని మండలాల పరిధిలో మహిళా ఓటర్లే అత్యధికంగా ఉండటం వల్ల వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా వారు ఎక్కువగా పోటీకి సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్ ఉండటం వల్ల తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. గతంలో కూడా జరిగిన ఎన్నికల్లో రిజర్వేషన్‌కు మించి మహిళలు పోటీ చేశారు. స్థానిక సంస్థల తప్పనిసరిగా జరిపించాల్సి ఉండటంతో ముందస్తుగానే గ్రామాల్లో పోటీకి నేతలు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఈ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం మాత్రం అధికారులు ఈ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు.

# భార్య భర్త, ఇద్దరు కొడుకులు..

**ఆదిలాబాద్ నుంచి తెచ్చుడు.. హైదరాబాద్‌లో అమ్ముడు**

**డబ్బు సంపాదన కోసం గంజాయి స్మగ్లర్స్‌గా మారిన కుటుంబం**

**హెచ్ న్యూ పోలీసులకు చిక్కి కటకటాలపాలు**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి మండలం షాబాద్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్ బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి రాజేంద్రనగర్‌లో ఉంటూ ప్యాసింజర్ ఆటో నడుపుతున్నాడు. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో తన భార్య ఇద్దరు కొడుకులతో కలిసి గంజాయి సరఫరా చేస్తూ అడ్డదారిలో డబ్బు సంపాదిస్తున్నాడు. చివరకు హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) పోలీసులకు చిక్కి. కుటుంబంతో సహా.. కటకటాలపాలయ్యారు. డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..

షాబాద్‌కు చెందిన బ్యాగరి అనంతయ్య (53) కొన్నాళ్లుగా కుటుంబంతో సహా.. రాజేంద్రనగర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య నీరజ, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, రవికాంత్ ఉన్నారు. భార్య ఇంట్లోనే ఉంటుండగా.. పెద్దకొడుకు ఉబర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే వచ్చే సంపాదన సరిపోకపోవడంతో అనంతయ్య తన భార్య, కొడుకులతో చర్చించి సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషించారు. నగరంలో గంజాయికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో గంజాయి సరఫరా చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు.

**● ఆదిలాబాద్ నుంచి నగరానికి దిగుమతి..**

ఆదిలాబాద్‌కు చెందిన గంగన్న మొదట వ్యవసాయం చేసేవాడు. ఆ తర్వాత వ్యవసాయం వదిలేసి గంజాయి సప్లైయర్‌గా మారాడు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ ప్రాంతాలకు చెందిన రైతుల వద్ద గంజాయిని సేకరించి దాన్ని నగరంలోని ప్రధాన స్మగ్లర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. గత రెండేళ్లుగా గంగన్న ఆదిలాబాద్ నుంచి గంజాయిని తెచ్చి అనంతయ్యకు ఇచ్చేవాడు. ఆ తర్వాత అనంతయ్య భార్య నీరజ గంజాయిని చిన్ని చిన్న పొట్లాలుగా ప్యాకింగ్ చేసేది. వాటిని అనంతయ్యతో పాటు.. ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, రవికాంత్‌లు తీసుకెళ్లి నగర శివారు ప్రాంతాల్లోని గంజాయి సేవించే కస్టమర్స్‌కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాస్, డేనియల్ టీమ్ అఫ్జల్‌గంజ్ పోలీసులతో కలిసి ఎంజీబీఎస్ బస్టాండ్‌లో అనంతయ్యను, ఆదిలాబాద్‌కు చెందిన గంగన్నను పట్టుకున్నారు. అనంతరం అనంతయ్య భార్య నీరజ, చిన్న కొడుకు రవికాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, ఒక ఆటో, రూ.3,400 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





# నేడు పాఠశాలల క్రీడలు ప్రారంభం

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 22: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడలు ప్రారంభం కానున్నాయి. క్రీడల ప్రారంభంతో పాటు డబుల్‌రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

పెర్కిట్, సెప్టెంబరు 22: ఇటీవల చేపూర్ గ్రామంలో నిర్వహించిన ఆర్మూర్ అర్బన్ స్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో నలంద పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్టు పాఠశాల కరస్పాండెంట్ సాగర్ తెలిపారు. బాలుర జూనియర్ వాలీబాల్ విభాగంలో, బాలుర సబ్‌జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలువగా, బాలుర సబ్‌జూనియర్ ఖోఖో, జూనియర్ ఖోఖో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. మార్చ్‌ఫస్ట్‌లో రెండవ బహుమతి సాధించిన విద్యార్థులు అథ్లెటిక్స్‌లో కూడా పలు బహుమతులు సాధించాలని వారు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యజమాన్యం అభినందించింది.

# ఉరివేసుకుని మహిళ మృతి

ఎడపల్లి, సెప్టెంబర్ 22: ఎడపల్లి మండలంలోని బాపూనగర్ గ్రామానికి చెందిన మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాపూనగర్ గ్రామానికి చెందిన అనిత (38) బర్రెలను కాసే విషయంలో భర్త శ్రీనివాస్‌తో గొడవపడి భర్త ఇంటినుండి బయటకు వెల్లగానే ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని, మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# పంచాయతీ కార్మికులకు సన్మానం

ఎడపల్లి, సెప్టెంబర్ 22: దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ ఆదివారం మండలంలోని మంగల్‌పాడ్, కుర్నాపల్లి, ఠాణాకలాన్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బట్టలను పంపిణీ చేసి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆదేశాల మేరకు మండలంలోని పంచాయతీ కార్మికులకు బట్టలను పంపిణీ చేసి వారిని సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లెపూల శ్రీనివాస్, సూర కిరణ్, కట్కం అరుణ్, అభినవ్, ప్రదీప్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.







షబ్బీర్ అలీతో నిఖత్ జరీన్

# షబ్బీర్ అలీని కలిసిన నిఖత్ జరీన్

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 22: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్, ఒలింపిక్స్‌లో పాల్గొన్న జిల్లాకు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్ ఆదివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిశారు. డీఎస్పీగా తనను నియమించేందుకు కృషి చేసిన షబ్బీర్ అలీకి ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఒలింపిక్స్ స్థాయి అథ్లెట్లను తయారు చేసేందుకు వచ్చే విద్యాసంవత్సరంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గడుగు గంగాధర్, జావిద్ అక్రమ్ ఉన్నారు.

# ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల నూతన కార్యవర్గం ఎన్నిక




నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 22: జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా చిన్నయ్య, శ్రీనాథ్, పరిశీలకులుగా బుద్దిరాజు, రజియుద్దీన్‌లు వ్యవహరించారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి బాలికల కళాశాలలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, ఉపాధ్యక్షులుగా జాఫర్, సంయుక్త కార్యదర్శిగా సురేష్‌బాబు, కోశాధికారిగా ప్రసాద్, మహిళా కార్యదర్శిగా పవనశ్రీ, ఈసి మెంబర్లుగా ప్రకాశ్, తులసీదాస్, సురేష్, అర్వింద్, ఫయాంలు ఎన్నికయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

# కనీస వేతనాలు అమలు చేసే వరకూ ఉద్యమిస్తాం



సమావేశానికి హాజరైన ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 22: కేజీబీవీ, యూఆర్‌ఎస్, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్, వర్కర్లకు కనీస వేతనాలు తక్షణమే అమలు చేయాలని పనిభారం తగ్గించాలని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజేషన్ చేయాలని లేదంటే ఉద్యమిస్తామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. జాబ్ చాట్, వీక్లీ ఆఫ్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్డ్‌మెంట్ వయస్సు 60 సంవత్సరాలకు పెంచి బెనిఫిట్స్ ఇవ్వాలని, మోడల్ స్కూల్ సిబ్బందికి కేజీబీవీ పద్ధతిలోనే వేతనాలు ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, ఉపాధ్యక్షుడు వెంకన్న, కేజీబీవీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఈశ్వరి, జిల్లా అధ్యక్షురాలు హేమలత, సుమలత, ప్రశాంతి, సంధ్య, సుజాత, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉరేసుకుని రైతు ఆత్మహత్య

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 22: అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని రాంపూర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ గ్రామానికి చెందిన రాంగొండ (39) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. తమ కుటుంబానికి చెందిన మూడు ఎకరాల భూమిలో సాగు చేస్తున్నాడు. గత కొన్నేళ్లుగా పంట దిగుబడి రావడం లేదని ఆవేదన చెందేవాడు. ఈ క్రమంలో ఈ ఖరీఫ్‌లో వేసిన వరికి తెగుళ్లు ఆశించడంతో పంట ఎక్కువగా దెబ్బతిన్నది. పంటల కోసం చేసిన అప్పులు పెరిగిపోతున్నాయని తరచూ భార్య లక్ష్మితో చెప్పి బాధపడేవాడు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. రాత్రి 10 గంటల సమయంలో బాన్సువాడ మండలం రాంపూర్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని ఉరేసుకుని ఉన్నట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా రైతు రాంగొండగా గుర్తించారు. అప్పుల బాధతో తన భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య పిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

## ఎమ్మెల్యే, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్



హైదరాబాద్‌లో సుదర్శన్‌రెడ్డిని కలిసిన నూతన వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్

మెండోర, సెప్టెంబరు22: నూతన వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి హైదరాబాద్‌లోని మాజీమంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను, మానాల మోహన్‌రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమించినందుకు హైదరాబాద్‌లోని సుదర్శన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డి, రాష్ట్రకార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి,బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్,వేణుగోపాల్ యాదవ్ గడుగు గంగాధర్‌లకు శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏబీ.చిన్న, వెంకటేష్‌గౌడ్, సోంరాజేందర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఏఎంసీ వైస్ చైర్మన్



ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న రాంచందర్

నవీపేట,సెప్టెంబరు 22: ఇటీవల నిజామాబాద్ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన జే.రాంచందర్ ఆదివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డినిహైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో నవీపేట ఎంపీపీగా పని చేసిన రాంచందర్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా కొనసాగుతున్నారు. శనివారం నిజామాబాద్ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్‌గా జే.రాంచందర్ నియామకం అయ్యారు. తనను ఏఎంసీ వైస్ చైర్మన్‌గా నియామకానికి కృషి చేసిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి ఉన్నారు.

## మహిళలు ఆర్థికంగా రాణించాలి



శక్కర్ నగర్‌లో కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,సెప్టెంబరు 22: మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని లయన్స్ క్లబ్ శక్కర్‌నగర్ ప్రతినిధులు రామకృష్ణ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ శక్కర్‌నగర్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలన్నారు. మహిళల సంక్షేమం కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ శక్కర్‌నగర్ అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు గణపతిరెడ్డి, శ్రీకాంత్, జాన్, పాండురంగారావు, సత్యం, చక్రవర్తి, నాయిని కృష్ణ ప్రసాద్, వర్ని క్లబ్ అధ్యక్షులు ఠాగూర్, ప్రోగ్రామ్ చైర్మన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



ఉత్సవ కమిటీ ఎన్నికయిన సభ్యులు

బోధన్‌రూరల్,సెప్టెంబరు 22: బోధన్ సార్వజనిక్ దేవి నవరాత్రి ఉత్సవ కమిటీని ఆదివారం పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో పట్టణ ప్రముఖులు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా తాడు మహేష్, కార్యదర్శిగా పవన్, కోశాధికారిగా శ్యామ్, తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరికాంత్ చారి, దాము, గుండెటి శంకర్, బీర్కూర్ బుజ్జి, శ్రీకాంత్ గౌడ్, గుమ్ముల అశోక్ రెడ్డి, పవన్ కుమార్, సుధాకర్ చారి, విద్యాసాగర్, వినోద్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా గడ్డం నర్సారెడ్డి



మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, సెప్టెంబరు22: వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా కొత్తపల్లి గ్రామానికి చెందిన గడ్డం నర్సారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వాడి, పచ్చలనడ్కుడ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం గడ్డం నర్సారెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామాల రైతులకు ఎల్లవేళల అండదండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నర్సారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కర్ గంగాధర్, సొసైటీ డైరెక్టర్ నర్సారెడ్డి, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా సెక్రెటరీ లింగేష్, నాయకులు నరేష్, వాడి బద్దం మహేందర్, వేణు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

కోటగిరి,సెప్టెంబరు 22: పోతంగల్ మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పోతంగల్ సమీపంలో ఇసుకను అక్రమంగా నింపి తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు టిప్పర్‌ను పట్టుకున్నామన్నారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## గ్రామాల్లో ఘనంగా ఊరపండగ

డిచ్‌పల్లి, సెప్టెబరు 22: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి, ఘన్‌పూర్ గ్రామాల్లో ఘనంగా ఊరపండగా వేడుకలు నిర్వహించారు. గ్రామ దేవతాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజులు చేసిన విన్యాసలు ఆకట్టుకున్నాయి.

# పని ఒత్తిడిలో ఏఈవోలు

● అదనపు పనుల అప్పగింతతో మరింత భారం ● ఏడేళ్లుగా తమ సమస్యలను పట్టించుకోవడంలేదని అసంతృప్తి



పంటలను పరిశీలిస్తున్న ఏఈవో (ఫైల్‌ఫోటో)



జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు22: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలను విజయవంతం చేయడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ పథకాల అమలులో ప్రముఖ పాత్ర పోషిస్తున్న ఏఈవోల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ విస్తీర్ణ అధికారులు (ఏఈవో)లు పనిభారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. రానురాను పనిభారం పెరగడంతో మానసికంగా కుంగిపోతున్నామని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఈవోలుగా పని చేస్తున్న గ్రామానికి ఒక వీలెజ్ అసిస్టెంట్‌ను నియమించాలని గత కొంత కాలంగా కోరుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. విలేజ్ అసిస్టెంట్‌ను నియమిస్తే తమకు కొంతైన పనిభారం తగ్గుతుందని వారు భావిస్తున్నారు.

● ఐదు వేల ఎకరాలకు క్లస్టర్... ఒక ఏఈవో..

జిల్లాలో ప్రతీ ఐదు వేల ఎకరాల విస్తీర్ణానికి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక వ్యవసాయ విస్తీర్ణాధికారిణి నియమించారు. వీరు సుమారు ఏడు నుంచి తొమ్మిది నెలల ఎకరాల సాగు భూమిని పర్యవేక్షించాల్సి వస్తోంది.. దీంతో వారికి బాధలు తప్పడంలేదు. ఒక్కో క్లస్టర్‌కు నియమించిన ఏఈవోలు తమ పరిధిలోని గ్రామాలలో రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, పంటల నమోదు, పంట నష్టం సర్వే, రైతు నేస్తం కార్యక్రమాలు కొనుగోలు కేంద్రాల పరిశీలన, రైతులకు అవగాహన సదస్సులు, రైతు వేదికల నిర్వహణ పనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిపేందుకు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులుగా నియమించారు. తలకు మించిన భారంతో సతమతమవుతున్న తమకు ప్రత్యేక అధికారులుగా నియమించడం మరింత భారం పెంచిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

● విలేజ్ అసిస్టెంట్‌లను నియమించాలి

ఏఈవోలకు ఉన్నతాధికారులు డి జిటల్ పంటల సర్వే పనులను అప్పగించారు. గ్రామాలలో విలేజ్ అసిస్టెంట్ లేకపోవడంతో వీరికి ఇబ్బందిగా మారింది. పంటల డిజిటల్ సర్వే చేయడం అంటే ఒక్కో ఏఈవో సర్వేనెంబర్‌ల వారిగా రైతుల పంట పొలాలకు వెళ్ళి వారు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు ఫోటో తీసుకొని డిజిటల్ సర్వే చేయాల్సి ఉంటుంది. పంటల డిజిటల్ సర్వే, పంట నష్టం అంచనా, పరిశీలన తదితర విషయాలలో మహిళ ఏఈవోలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సర్వే చేయడానికి ఒక్కో గ్రామానికి ఒక్క విలెజ్ అసిస్టెంట్ తప్పనిసరిగా అవసరం ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచనలు చేయడంలేదు. ఏఈవోలకు పనిభారం తగ్గించాలని, విలెజ్ అసిస్టెంట్‌లను నియమించాలని తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాలను సంబంధిత జిల్లా అధికారుల ద్వారా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. ఈనెల 26లోగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని, లేని పక్షంలో 27వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు ప్రభుత్వానికి పంపిన వినతిలో స్పష్టం చేశారు.

## పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు శివరాజ్

బోధన్‌రూరల్,సెప్టెంబరు 22: పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని నాయకులు శివరాజ్ అన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 30వ తేదిన రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవ సభ కార్యక్రమం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించబడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆదివారం బోధన్ పట్టణంలోని తాలూకా రైస్‌మిల్ అసోసియేషన్ భవన్‌లో పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాటి నుండి నేటి వరకు నిత్యం విద్యార్థుల సమస్యలతో ఎన్నో సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ పాలకవర్గ, మతోన్మాద గుండాల దాడిని ఎదుర్కొని పోరాడుతూ 50వ స్వర్ణోత్సవ సభ జరుపుకోనుందన్నారు. జార్జి, జంపాల, శ్రీపాద, శ్రీహరి, కామ్రేడ్ రంగవల్లిల రక్త తర్పనాలతో ఎరుపెక్కిన బిగిపిడికిలి జెండాతో ఏర్పడ్డ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం గురించి వివరించారు. రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవ సభలో పీడీఎస్‌యూ సభ్యులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పీడీఎస్‌యూ నాయకులు సంజీవ్, గంగారాం, బలరామ రాజు, మల్లేష్, లింగం, గణేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, గణేష్, మౌనిక, గంగాకిషోర్, మహిపాల్, నాయకులు గంగాధర్, రాజేశ్వర్, రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్మర్‌పల్లికి మూడోసారి దక్కిన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి



కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ,వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 22: గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయమార్కెట్ కమిటీలు ప్రకటించిన తరువాత కమ్మర్‌పల్లి మండలానికి కమిటీని ప్రకటించారు.అప్పటినుంచి కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీకి ఐదు సార్లు పాలకవర్గాలను ప్రకటించారు. ఇందులో నిన్నటి కమిటీ ప్రకటనతో కమ్మర్‌పల్లి మండలానికి మూడుసార్లు మార్కెట్ కమిటీ పదవులు దక్కాయి. మార్కెట్ కమిటీల ఏర్పాటు అనంతరం కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీని తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేశారు అప్పటి ప్రభుత్వ విప్ ప్రస్తుత ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రధాన అనుచరుడు కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన సుంకెట్ రవిని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ తొలిచైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన 2012 నుంచి 2015 వరకు మార్కెట్ కమిటీకి తొలిచైర్మన్‌గా వ్యవహరించారు. కాగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం మిషన్ భగిరథ వైస్ చైర్మన్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అనుచరుడు భీమ్‌గల్ మండలానికి చెందిన దోన్కటి నర్సయ్యకు కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ పదవి దక్కింది. తదానంతరం మంత్రి హోదాలో ఉన్న ప్రశాంత్‌రెడ్డి తన అనుచరుడు మాజీఎంపీపీ భర్త కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ గ్రామానికి చెందిన మలోత్ ప్రకాశ్‌నాయక్‌కు ఈ పదివి అప్పగించారు. ఆయన 2019 నుంచి 2021 వరకు పదివిలో కొనసాగారు. అనంతరం భీమ్‌గల్ మండలానికి చెందిన గున్‌వీర్‌రెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదివిదక్కింది. ఆయన 2022 నుంచి ఎన్నికలు అయ్యో వరకు యడాదిన్నరకాలం వరకు చైర్మన్‌గా కొసాగారు. తదానంతరం ఎన్నికలు రావడం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో మార్కుట్ కమిటీ పాలకవర్గం లేకుండానే ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలలు కాలం అనంతరం శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మార్కెట్ కమిటీల పూతన పాలకర్గం ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజికవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా కొనసాగుతున్న కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన ఆ గ్రామమాజీ సర్పంచ్ పాలెపు నర్సయ్యను కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదివి వరించింది. కాగా కమ్మర్‌పల్లి మండలానికి వైస్ చైర్మన్ పదవులు దక్కడం ఇది రెండోసారి దోన్కంటి నర్సయ్య హయాంలో మాజీ సర్పంచ్ గడ్డం స్వామికి దక్కగా ప్రస్తుతం కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మార్కెట్ కమిటీ తొలిచైర్మన్ సుంకెట రవి చిన్నాన్న సుకెంట బుచ్చన్నను వరించింది.

## విద్యార్థుల క్రీడా నైపుణ్యాన్ని గుర్తించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ రవికుమార్

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు22: విద్యార్థుల్లో దాగి వున్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా చాటేలా కృషి చేయాలని ఆర్మూర్ సీఐ రవికుమార్ అన్నారు. ఆదివారం ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా కొనసాగిన ఆర్మూర్ పట్టణ అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ముఖ్యఅతిథిగా సీఐ రవికుమార్ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివానని, చదువును అశ్రద్ధ చేయకుండా పట్టుదలతో చదివి ఈ స్థాయికి చేరుకున్నానన్నారు.మొబైల్ ఫోన్‌లు, ఇతర చెడు అల వాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజాగంగారాం, క్షత్రీయ విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అలాపూర్ గంగాధర్, క్రీడల కన్వీనర్ శ్రీనివాస్, కోకన్వీనర్ లక్ష్మీనర్సింహస్వామి, గోపి, బ్రిజేష్, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చట్టపరమైన చర్యలు

వేల్పూర్, సెప్టెంబరు22: వేల్పూర్ మండల గ్రామాలలో ప్రధాన రోడ్లపై వాహనదారులకు ఇబ్బంది కలిగే విధంగా ధాన్యం ఆరబోస్తే చటపరమైన చర్యలు తీసుకుంటామని వేల్పూర్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం, కుప్పలుపోయడం వల్ల వాహనదారులు వాటిని గమనించకుండా రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు రైతులు ఎవరు కూడా వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై ధాన్యం పోయవద్దని, పోసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి

డొంకేశ్వర్, సెప్టెంబరు22: డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి గేదే మృతి చెందింది. గ్రామశివారులో మేత కోసం వెళ్ళిన గేదే తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్ తగిలి మృతి చెందింది. మృతి చెందిన గేదే విలువ సుమారు రూ.55వేలు ఉంటుందని, తనకు నష్టపరిహారం ఇప్పించాలని రాచర్ల గంగారాం కోరుతున్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకే పంపిణీ చేయాలి



రుద్రూరు బస్టాండ్ చౌరస్తాలో జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

రుద్రూరు, సెప్టెంబరు 22 :రుద్రూరు మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకే పంపిణీ చేయాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్‌చేశారు. ఆదివారం రుద్రూరు సీపీఎం గ్రామ పార్టీ శాఖ మహా సభ గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ సందర్భంగా రుద్రూరు బస్టాండ్ చౌరస్తాలో పార్టీ జెండాను లక్ష్మణ్ ఎగురవేశారు. అనంతరం పార్టీ ప్రతినిధులు సభలో గత మూడేళ్ల కాలంలో చేసిన ఉద్యమాలపై సమీక్ష చేసి భవిష్యత్తు కార్యచరణపై పలు తీర్మానాలు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేయాలని పార్టీని బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం ఏరియా కార్య దర్శి నన్నేసాబ్ పిలుపునిచ్చారు. ఈమహాసభలో నెల్లూరి లక్ష్మణ్‌ను కార్య దర్శిగా, భీమయ్య, గంగాధర్,గంగారాం లను కూడా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

## టీచర్స్ కాలనీలో బీజేపీ సభ్యత్వం



బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు22: పట్టణంలోని టీచర్స్ కాలనీ 10వార్డులో ఆదివారం బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు లోక భూపతిరెడ్డి ఇంటింటికి వెళ్తూ బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. అలాగే మోదీ అబిమానులు సైతం సభ్యత్వాన్ని చేయించుకున్నారు. ఆన్‌లైన్ నెంబర్ 8800002024కు కాల్ చేసి సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ప్రధానకార్యదర్శి పొల్కం వేణు, సీనియర్ నాయకులు విజయానంద్, దాసరి గోపి, సతీస్, తదితరులు పాల్గొన్నారు.

## రుణ మాఫీలో సర్కారు విఫలం




మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు22: ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణాల మాఫీలో రాష్ట్ర సర్కారు విఫలమైందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, కిసాన్‌మోర్చ నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత శాసన సభ ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి సర్కారు హామీలను మరిచిపోయిందని, ప్రజలకు మేలు చేయాల్సింది పోయి ప్రజల నడ్డి విరుస్తుందని అన్నారు. రైతు రుణాలు మాఫీ చేయకుండా రైతులను ఇబ్బందిపెడుతుందని, ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు రుణాలను మాఫీచేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందిపెట్టిన ఏ ప్రభుత్వం రాష్ట్రంలో బాగుపడలేదని, ప్రభుత్వం మెడలు ఏ విధంగా వంచలో రైతులకు బాగా తెలుసని, తక్షణమే రైతు బంధు, రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారుడిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారని, మొట్టమొదట సీఎం రేవంత్‌రెడ్డికే రైతు రుణమాఫీ చేసి పంట పెట్టుబడి సహాయం రైతులకు అందించాలని సలహ ఇవ్వాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ప్రధానకార్యదర్శి పొల్కం వేణు, ఆరే రాజేశ్వర్, చిట్టిబాజన్న, కాపెల్లి లింగం, తేలు ఒడ్డెన్న, తదితరులు పాల్గొన్నారు.

## 'మహాలక్ష్మీ' సబ్సిడీ పత్రాల అందజేత



పెర్కిట్‌లో లబ్ధిదారులకు సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న నాయకులు

పెర్కిట్, సెప్టెంబరు22:ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో మహాలక్ష్మీ సబ్సిడీ మంజూరు పత్రాలను ఆదివారం నాల్గవ వార్డు ఇన్‌చార్జీ సునీల్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న రూ.500లకే సిలిండర్, ఇతర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి రమేష్, అక్షయ్, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ప్రసాదం కల్తీ చేసిన జగన్‌ను కఠినంగా శిక్షించాలి



కోటగిరిలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కోటగిరి,సెప్టెంబరు 22: కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం తయారీలో పశువుల కొవ్వు, కల్తీ నూనెల వినియోగం జరగడంపై మండల బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటగిరి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ తిరుపతి లడ్డు ప్రసాదం పరమ పవిత్రమైందని, ఆ లడ్డులో జంతువుల కొవ్వు, కల్తీ నూనెలు కలిపి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామివారి ప్రసాదాన్ని కల్తీ చేసిన జగన్‌తో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందు దేవాలయాల పరిరక్షణ కమిటీ సభ్యులు గంగాధర్ దేశాయ్, హొగిర్‌రావు, బీజేపీ నాయకులు మోహన్ రావు, గజేందర్, భూమయ్య, సతీష్, హన్మాండ్లు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నవీపేటలో మిలాద్ ఉన్ నబి ర్యాలీ



నవీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మైనారిటీలు

నవీపేట,సెప్టెంబరు 22: మండల కేంద్రంలో ఆదివారం ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబి ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 16న మిలాద్ ఉన్ నబి పండుగ ఉండగా వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబి ర్యాలీని ముస్లింసోదరులు వాయిదా వేసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పెద్ద ఎత్తున మైనారిటీ యువకులు, నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

## పిప్రిలో దొంగతనం

● 13గ్రాముల బంగారం, పది తులాల వెండి, రూ.లక్ష 70వేల నగదు అపహరణ

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు22: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో దుంపల కవిత ఇంట్లో గుర్తుతెలియని దొంగలు శనివారం అర్ధరాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. శనివారం దుంపల కవిత ఇంటికి తాళం వేసి పక్కింట్లో పడుకొగా తెల్లవారు జామున లేచిచూసే సరికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్ళి చూడగా బీరువలో ఉన్న 13గ్రాముల బంగారం, పది తులాల వెండి, రూ.లక్ష 70వేల నగదును అపహరించుకుపోయారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి, క్రైం పార్టీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలు కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

## పడకల్‌లో ఒకరి అదృశ్యం

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు22: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన బండారి సాయన్న అదృశ్యమైనట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. జక్రాన్‌పల్లిలో గత కొన్ని రోజులుగా నివాస ముండగా వ్యక్తి గత పనులపై పడకల్‌కు వచ్చి ఈనెల 19న తిరిగి రావల్సి ఉండగా ఇంత వరకు రాలేదని, సాయన్న ఆచుకి కోసం గాలిస్తు న్నప్ప టికీ జాడతెలియలేదని ఎస్సై తెలిపారు. సాయన్న భార్య సత్తెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## ముగిసిన పూలాంగ్ జెండా ఉత్సవాలు



పూలాంగ్ వద్ద జెండాను ఊరేగిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 22:గత ఐదు రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న పూలాంగ్ జెండా ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి వంశపారంపర అర్చకులు అజయ్ సంగ్వాయ్, సంజు సంగ్వాయ్, విజయ్ సంగ్వాయ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలాంగ్ ప్రాంతంలో ప్రతిష్ఠించిన జెండాకు వేదపండితులు వేదమంత్రాలతో పూజలు జరిపారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణలు, మేళతాళాలతో జెండాను వంశ పారంపర వతన్‌దారులు ఆర్మూర్ గల్లి భక్తులు జెండాను ఊరేగింపుగా బర్ధిపూర్‌కు తరలించారు. జెండా ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని, జెండాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవుదినం కావడంతో నగరంలోని చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి మా కష్టాలను తొలగించి అనుగ్రహించమని వేడుకుంటూ జెండాపై చక్కెరను చల్లి భక్తిని చాటుకున్నారు.

## నేటి నుంచి డీఎస్ మెమోరియల్ స్పోర్ట్స్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22: ధర్మపురి శ్రీనివాస్ మెమోరియల్ స్పోర్ట్స్ సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో (కలెక్టరేట్ గ్రౌండ్) సోమవారం ఉదయం మార్చ్‌ఫాస్ట్‌తో ప్రారంభమయ్యే ఈ పోటీలు 27వ తేదీన ముగుస్తాయని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీలో జిల్లా నలుమూలల నుంచి 150 పాఠశాలలు, కళాశాలలకు చెందిన 4వేల మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటారని అన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్ విభాగాల్లో పోటీలు ఉంటాయని అన్నారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతితో పాటు మెమోంటో అందించడం జరుగుతుందని తెలిపారు.

## గ్రంథాలయంలో గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్



సెంట్రల్ లైబ్రరీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 22: గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం నమూనా పరీక్షను ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. షైన్ ఇండియా గ్రూప్-2 అకాడమి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా గ్రంథాలయం పాఠకులతో పాటు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అకాడమి ప్రతినిధి కిశోర్ మాట్లాడుతూ అభ్యర్థుల్లో భయాన్ని తొలగించడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకొని తమయొక్క గ్రూప్-2 ప్రిపరేషన్‌ను మరింత శ్రద్ధతో కొనసాగించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ రాజరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, అభిలాష్, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా సిరికొండ వాసులు

సిరికొండ, సెప్టెంబరు 22: కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం సభ్యులుగా సిరికొండ మండలానికి చెందిన గడ్కోల్ గ్రామ వాసి రొక్కం సంపత్, న్యావనంది గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముత్తెన్నను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలానికి చెందిన ఇద్దరిని డైరెక్టర్లుగా నియమించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సిఫారసుల మేరకు వీరి నియామకం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.రవి తెలిపారు.

## క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలి

- రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు22: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. ఆదివారం ఆర్మూర్ మండలం మిర్దాపల్లి గ్రామంలో జరిగిన మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా తాహెర్‌బిన్‌హం దాన్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని, ఓటమి గెలుపునకు నంది అని అన్నారు. విద్యార్థులు తమ ఇష్టమైన ఆటను ఎం చుకొని అందులో రాణించేందుకు కృషి నిజామాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలన్నారు. ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి రాణించి ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంసాగర్‌ప్రాజెక్టు మాజీచైర్మన్ యాల్ల సాయిరెడ్డి, క్రీడల నిర్వాహకులు, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బాపూజీ వచనాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం : భక్తవత్సలం



సమావేశంలో మాట్లాడుతున్న భక్తవత్సలం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 22:జిల్లా కేంద్రంలో ఉన్న బాపూజీ వచనాలయ అభివృద్ధికి, నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామని దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని బాపూజీ వచనాలయ అధ్యక్షుడు భక్తవత్సలం కోరారు. ఆదివారం బాపూజీ వచనాలయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ వచనాలయ స్థాపన కొరకు, అభివృద్ధి కొరకు అప్పటి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నల్ల రుక్మారెడ్డి సహకరించారని అప్పటి పెద్దలను స్మరించుకోవడం మన కర్తవ్యం అన్నారు. బాపూజీ వచనాలయ నిర్మాణానికి ఆయన చేసిన సేవలు గొప్పవన్నారు. వచనాలయంలో ఐదు భాషలలో 32వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ఐదు భాషల్లో నవలలతో పాటు వివిధ అంశాలకు చెందిన విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఐదు భాషలకు చెందిన దిన, వార, మాస పత్రికలతో పాటు ఆధ్యాత్మిక పుస్తకాలను, నవలలను తెస్తున్నామన్నారు. విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అన్ని రకాల పుస్తకాలను కొనుగోలు చేస్తూ వారికి అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. ప్రతీరోజు 200 మంది విద్యార్థులు వచనాలయంలో చదువుకుంటున్నారని ఇప్పటి వరకు 20వేలకు పైగా ఉద్యోగాలను ఈ వచనాలయంలో చదువుకొని పొందడం గొప్ప విషయమన్నారు. అన్ని రకాల సదుపాయాలతో బాపూజీ వచనాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు ప్రకాశ్, జాయింట్ సెక్రెటరీ హన్మంత్‌రావు, కోశాధికారి గంగాధర్, ఈసీమెంబర్లు లక్ష్మీనారాయణ, అశోక్, మహిపాల్‌రెడ్డి,సుధాకర్, పాల్గొన్నారు.

# మండలాల్లో ఘనంగా ఊర పండుగ



మోస్రాలో ఊర పండుగ దృశ్యం



బోర్గాంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

మోస్రా,సెప్టెంబరు 22: ఊర పండుగ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు సూరే సాయిలు మాట్లాడుతూ గ్రామంలో చెడును ప్రలదోలడానికి ఈ పండుగను పెద్దలు జరిపే వారు అదే ఆనవాయితీగా జరుపుతున్నాం. గతంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఊర పండుగ జరిగేది కాని 2015లో ఊర పండుగ జరుపగా అటు తర్వాత ఈ సంవత్సరం ఊర పండుగ జరపడం జరిగింది. ఈ పండుగను అచ్చినమ్మ దేవత పేరుగా జరుపడం జరిగింది. గ్రామంలో ఉన్న చెడును ప్రలదోలడానికి గొర్రెను బలి ఇచ్చి ఊరపానడగాలో భాగంగా గ్రామ దేవత అచ్చినమ్మ ఆలయం వద్ద గొర్రెను బలి ఇచ్చి గావు పట్టిన వారు రంగం ఎక్కి గ్రామ భవిష్య వాణి తెలిపారు. గ్రామాన్ని చల్లగా చూడాలని పాడి పశువులు బాగుండాలని, పంటలు బాగా పండాలని ఈ కార్యక్రమం జరుపుతున్నామని గ్రామ కమిటీ అధ్యక్షుడు సూరే సాయిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడుతో పాటు ఉపాధ్యక్షులు పీ.నాగిరెడ్డి, షరీఫ్, గ్రామ పెద్దలు బిల్లా పోతారెడ్డి, గ్రామకమిటీ సభ్యులు, మహిళలు, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

**మోపాల్:**మండలంలోని ఆయా గ్రామాల్లో ఊరపండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం గ్రామంలో ఊర పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ ఊరపండుగను జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. మండలంలోని బోర్గాం(పి),మంచిప్ప, కంజర్, కులాస్‌పూర్, బాడ్సి, సిర్పూర్, రాణాకుర్దు, తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటింటి ఓటరు సర్వే చేస్తున్న మున్సిపల్ కమిషనర్



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22: ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. నగర పాలక సంస్థ కమీషనర్ మంద మకరంద్ ఆదివారం పెద్దబజార్ ప్రాంతంలో తిరుగుతూ ఓటరు సర్వేను నిర్వహించారు. పెద్దబజార్‌లోని పలు కాలనీలో తిరుగుతూ ఓటరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని మార్పులు, చేర్పులు ఉంటే సరి చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**● నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం...**

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆదివారం కంఠేశ్వర్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరంలోని 44వ డివిజన్‌లో చెత్తఉన్న ప్రాంతాలను శుభ్రంచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ పరీక్షలు



బెల్ట్‌లను ప్రధానం చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22: తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ పరీక్షలను ఆదివారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో సుమారు 80 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి కలర్ బెల్ట్‌ను సాధించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బస్వాలక్ష్మీనర్సయ్య, ఒలంపిక్ అసోసియేషన్ ఛైర్మన్ లింగన్న హాజరై క్రీడాకారులకు బెల్ట్‌లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వెంకట రమణాగౌడ్, లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో

## స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం



రఘునాథ చెరువు వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22: జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని రఘునాథ చెరువు వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గణాంక శాఖ కార్యాలయ ఇన్‌చార్జి భరత్‌రాజ్ హాజరై మాట్లాడారు. పరిశుభ్రత పాటిస్తూ తమ పిల్లలకు కూడా శుభ్రతను అలవాటు చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం చెత్త వేయను, ఇతరులను వేయనివ్వను అనే ఉద్దేశ్యంతో మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, నిరంకర్ వర్మ, అనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### అంత్యక్రియలకు ముత్యాల

## సునీల్ కుమార్ ఆర్థిక సహాయం

ఏర్గట్ల, సెప్టెంబరు 22: మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన బీరెల్లి ఎర్రన్న మృతి చెందగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ అంత్యక్రియలకు రూ.5 వేలు పంపంగా గ్రామం లోని కాంగ్రెస్ నాయకులు మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జింక అనిల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జక్రాన్‌పల్లిలో ఘనంగా కట్టమైసమ్మ పండగ



కట్ట మైసమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు22: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో కట్టమైసమ్మ దొంతుల మైసమ్మను ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్థులు ఊరేగింపుగా వెళ్లి కట్టమైసమ్మ మంగళహారతులు, బోనాలతో వెళ్లారు. కట్టమైసమ్మకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు22: ఆలూర్ మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. తెలిసిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం ఆలూర్‌శివారులో దాడిచేయగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.16వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా ఎస్‌హెచ్‌వో రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### కూరగాయల ట్రేడర్‌కు

## మార్కెట్ కమిటీలో చోటు



నరేందర్

నిజామాబాద్ అర్బన్,సెప్టెంబరు 22: వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మొట్టమొదటి సారిగా నిజామాబాద్ మార్కెట్ కమిటీలో కూరగాయల ట్రేడర్‌కు అవకాశం కల్పించారు. ఎప్పుడు వ్యాపారస్తులకే చోటు కల్పించే సాంప్రదాయానికి స్వస్తి పలుకుతూ వంశపారంపర్యంగా కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్న గూపన్‌పల్లికి చెందిన ఎలిగేటి నరేందర్‌కుమార్‌కు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సిఫారసు మేరకు నియమించారు. విద్యార్థి దశ నుంచి ఎన్‌ఎస్‌యుఐలో పనిచేసి కాంగ్రెస్ పార్టీ యువజన విభాగంలో నరేందర్ పనిచేశాడు. తెలంగాణ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎల్‌ఎల్‌బి చేసిన నరేందర్‌కు మార్కెట్ కమిటీలో చోటు కల్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రైతులు, వ్యాపారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తనకు అవకాశం కల్పించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

### గ్రామీణ మంచినీటి

## సహాయకులకు శిక్షణ

సిరికొండ, సెప్టెంబరు 22: సిరికొండ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో పనిచేసే మంచినీటి సహాయకులకు ఈనెల 23 నుంచి 26 వరకు గడ్కోల్ రైతువేదికలో శిక్షణ ఉంటుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హర్షద్ తెలిపారు. ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎదురవుతున్న సమస్యలపై సహాయకులకు శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ శిబిరానికి మండలంలోని అన్ని గ్రామాల్లో పనిచేసే సహాయకులందరూ హాజరుకావాలని ఏఈ హర్షద్ కోరారు.

## 29న నవీపేటలో ఊర పండుగ

నవీపేట,సెప్టెంబరు 22: ఈ నెల 29న ఆదివారం నవీపేటలో ఊర పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో నవీపేట, తడగామ వీడీసీల అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు .ఈ నెల 26న అమ్మవారికి ముడుపు వేయాలని, 29ఆదివారం రోజున ఊరపండుగ నిర్వహించి గ్రామ దేవతలకు పూజలు నిర్వహించాలని తీర్మానించారు. పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఊర పండుగను నిర్వహించడం జరుగుతుందని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లి కాలువలో పడి వ్యక్తి మృతి

నవీపేట,సెప్టెంబరు 22: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని భరత్‌తండా సమీపంలోని అలీసాగర్ కాలువలో ఆదివారం ప్రమాదవశాత్తు జాదవ్ సంతోష్(38)అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. రెంజల్ మండలం మౌలాలి తండాకు చెందిన జాదవ్ సంతోష్ ఆదివారం ఉదయం చేపలు పట్టడానికి భరత్‌నగర్ తండా సమీపంలో ఉన్న అలీసాగర్ కాలువ వద్దకు వెళ్లాడు. చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా జాదవ్ సంతోష్ రెండో పెళ్లి చేసుకున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తండ్రి జాదవ్ వసంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## నిజాయితీ చాటుకున్న డాక్టర్ నందు

ధర్పల్లి, సెప్టెంబరు 22: ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన డాక్టర్ నందు తన నిజాయితీని చాటుకొని తనకు దొరికిన బ్యాగును పోలీసులకు అప్పగించాడు. దమ్మన్నపేట్ గ్రామానికి చెందిన ఆశన్న తన బ్యాగును రోడ్డుపై పోగొట్టుకున్నాడు. డాక్టర్ నందు వాకింగ్ చేస్తుండగా హెచ్‌పి పెట్రోల్ బంక్ పెద్దమ్మగుడి వద్ద బ్యాగును గమనించాడు. ఆ బ్యాగును ఎస్సై రామకృష్ణకు అందించగా అందులోని వివరాల ఆధారంగా బ్యాగును బాధితుడికి అప్పటించారు. ఆ బ్యాగులో 6వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లు, రెండు ఆర్‌సి పేపర్లు ఉన్నాయని ఎస్సై తెలిపారు.



## చికెన్ ధరలు

| రకం | : లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | : రూ.85 | రూ.200 | రూ. 220 |
| వెన్‌కాబ్(కిలో) | : రూ.95 | రూ.205 | రూ. 225 |

## బంగారం ధరలు

| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.76000 | రూ.70000 | రూ.925 |

## సినిమా గైడ్ నిజామాబాద్

**పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్**

స్క్రీన్-1 : పైలం పిలగా (1.15)
: మత్తు వదలరా-2 (4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (3డి ఇంగ్లీష్) (11.00, 4.35)
: యుద్ర (హిందీ) (1.30, 7.05)
: గొర్రె పురాణం (10.10)
స్క్రీన్-3 : మత్తు వదలరా-2 (12.50)
: సరిపోదా శనివారం (3.50, 10.30)
: యుద్ర (హిందీ) (7.25)
స్క్రీన్-4 : చీక్‌లెట్స్ (తెలుగు) (10.25)
: తుంబాడ్ (హిందీ) (1.05)
: మనం (3.45)
: మాయాబజార్ (7.10)
: స్త్రీ-2 (హిందీ) (11.00)



**ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : 35-చిన్నకథ కాదు (4.30)
: మత్తు వదలరా-2 (7.20, 10.25)
స్క్రీన్-2 : సరిపోదా శనివారం (1.30, 7.25)
స్క్రీన్-3 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (ఇంగ్లీష్ 3డి) (11.00, 4.40, 10.35)

దేవి : మత్తు వదలరా-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: యుద్ర (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: బొమ్మరిల్లు (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్